క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబుపేట: మండలంలోని కారుకొండ, ఇప్పటూర్, పోమాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్ ఆదివారం తెలిపారు. సోమవారం కొండాపూర్ ఫీడర్, పుట్టోనిపల్లి, కారూర్, రుద్రారం ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. తరచూ లైన్ల మధ్య ఇబ్బందులు రావటంతో వాటిని మరమ్మతులు చేసేందుకు కోత విధిస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజావాణి రద్దు

హన్వాడ: స్థానిక మండల పరిషత్‌లో సోమవారం జరగనున్న ప్రజావాణి కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ యశోద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–3పరీక్షల సందర్భంగా ఆయాశాఖల ఉద్యోగులు విధులకు వెళ్లాల్సి ఉండటంతో ప్రజావాణికి అందుబాటులో ఉండరు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ఫిర్యాదుదారులు ఈవిషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

మార్కెట్‌యార్డుకు భారీగా ధాన్యం



నవాబుపేట: నవాబుపేట మార్కెట్ యార్డుకు ఆదివారం 5199 బస్తాల వరిధాన్యం వచ్చింది. 1484బస్తాల మొక్కజొన్న వచ్చింది. వరికి అత్యధికంగా రూ.2701, తక్కువలో రూ.2089 ధర ఖరారైంది. మొక్కజొన్నకు రూ.2414లు ధర వచ్చింది. వచ్చే బుధ, ఆదివారాలు చాలా పెద్దమొత్తంలో ధాన్యం వస్తుందని, ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు.

మైసమ్మకు పూజలు




నవాబుపేట: మండలంలోని మైసమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. అడవిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులు సేదతీరారు. ఆప్రాంతమంతా సందడి నెలకొంది. దేవాలయం, మైసమ్మ అడవి మొత్తం భక్తులతో కళకళలాడింది.

పోలీసులకు ఫిర్యాదు

నవాబుపేట: వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తున్నారని భూమి పట్టాదారు విద్యావతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని చౌడూర్ గ్రామ శివారులో ఉన్న 340, 341 సర్వేనంబర్లలో 12, 17గుంటల భూమి ఉంది. దీన్ని 1954నుంచి వారసత్వంగా అనుభవిస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రస్తుతం తాము హైదరాబాద్‌లో ఉంటున్నాం. ఇక్కడ భూములకు ధరలు పెరగడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ భూమిలో ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించే ప్రయత్నం చేసినట్లు ఆమె పోలీసులకు వివరించారు. స్థానికంగా లేకపోవడంతో భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిని అడ్డుకోవాలని ఆమె కోరారు. ఈవిషయంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. .

‘నక్ష’లో జడ్చర్లకు చోటు



మున్సిపల్ వ్యూ

- సర్వేతో పక్కాగా తేలనున్న గృహాలు, ఆస్తుల లెక్కింపు
- త్వరలో క్షేత్రస్థాయిలోకి రానున్న బృందాలు

జడ్చర్ల టౌన్: నక్ష (నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్‌హ్యాబిటేషన్స్) పైలెట్ ప్రాజెక్ట్‌లో జడ్చర్ల మున్సిపాలిటీకి చోటు దక్కింది. 21 రాష్ట్రాల్లో 150మున్సిపాలిటీలను నక్షకు ఎంపిక చేయగా తెలంగాణలో పది మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల ఒక్కటే ఉండటం విశేషం.నక్ష ద్వారా గృహాలు, ఆస్తులు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు వంటివి రికార్డులు పక్కాగా తేలనున్నాయి. దీని ద్వారా ప్రతి ఇంటికి, ఆస్తికి పక్కాగా నక్ష (హద్దులు, మ్యాప్) ఏర్పడనుంది. ఏరియల్, ఫీల్డ్ సర్వే చేసేందుకు త్వరలోనే బృందాలు మున్సిపాలిటీకి రానున్నాయి.

మున్సిపాలిటీ పరిధిలోని..

నక్ష కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి, జడ్చర్ల, కావేరమ్మపేట, నాగసాల, బూరెడ్డిపల్లి గ్రామాలను 18 బృందాలు సర్వే చేయనున్నాయి. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు ఉండనున్నారు. ఒక సర్వేయర్, హెల్పర్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రైవేట్‌ఏజెన్సీ ద్వారా నియమిస్తుంది. వారికి సహాయంగా మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల నుంచి ఒక్కొక్క రెగ్యులర్ ఉద్యోగిని నియమించాల్సి ఉంటుంది. గత నెలలో వర్క్‌షాప్ నిర్వహించి సర్వేకు సంబంధించిన శిక్షణ సైతం ముగించారు. డిసెంబర్ నెలాఖరునాటికి నక్ష ప్రాజెక్ట్ పూర్తిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోచిస్తున్నాయి. మున్సిపాలిటీలోని మొత్తం ఐదు గ్రామాల్లోనూ 36.34 కి.మీ సర్వే నిర్వహించాల్సి ఉంది. సర్వే నిర్వహించేందుకు గానూ 18 రోవర్స్‌ను ఇవ్వనున్నారు. రోవర్‌సహాయంతోనే భూమిని సర్వే చేయాల్సి ఉంటుంది.

హద్దులు నిర్ణయించడంతో..

సర్వేలో మున్సిపాలిటీకి హద్దులు నిర్ణయించడం వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రతి ఇళ్లు, ఆస్తిని పక్కాగా సర్వేచేయనున్నారు. ఇంటికి సంబంధించి అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించనున్నారు. డ్రోన్‌తో వాటి ఫొటోలను, విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నారు. డిజిటలైజ్ చేసిన ప్రతి ఇళ్లు, ఆస్తికి ప్రాపర్టీకార్డులు జారీ చేయనున్నారు. ప్రాపర్టీ కార్డులు వస్తే బ్యాంకు రుణాలు పొందే వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులు సైతం గుర్తించటంతో వల్ల మున్సిపాలిటీకి భారీగా ఆస్తులు సమకూరుతాయి. త్వరలోనే నక్ష సర్వే బృందాలు మున్సిపాలిటీ రానున్నట్లు తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, సర్వే ఏడీ సాగర్ తెలిపారు. వారికి అన్నివిధాలా సహకరిస్తామన్నారు.

పేదలకు సేవచేయడం అభినందనీయం

హన్వాడ: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లోని ఎంకే ఆసుపత్రి సౌజన్యంతో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్య క్రమంలో వైద్యులు మహేష్ కుమార్, కరుణరాథోడ్, సందీప్, మాళవిక, అఖిల, మేనేజర్ బాలు, మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షకార్యదర్శులు రాంచంద్రయ్య, వెంకటయ్య, నారాయణ, కేశవరెడ్డి, గౌస్, గణపతినాయక్, వెంకటయ్య, జిల్లాఫోరం నాయకులు అక్కినేని నారాయణరావు, రాజసింహుడు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జగపతిరావు

‘పీఎం విశ్వకర్మ’ను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న రఘురాంగౌడ్

హన్వాడ: చేతివృత్తులు చేసేవారు పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని నాగినోనిపల్లి గ్రామంలో కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విశ్వకర్మ పథకానికి కేవలం విశ్వకర్మలే దరఖాస్తులు చేసుకోవాలనే అపోహను వీడాలన్నారు. ఎంపీ డీకే అరుణ సూచన మేరకు ప్రతి ఇంటికెళ్లి కేంద్రపథకాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విశ్వకర్మ పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శక్తికేంద్ర ఇంచార్జీ కృష్ణ, భూత్ అధ్యక్షుడు అశోక్, మోహన్, గిరి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

టీజీపీడీ అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షుడిగా నిరంజన్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఆదివారం టీజీపీడీపెటా అసోసియేషన్ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అన్ని జిల్లా అధ్యక్షుల, కార్యదర్శుల అభిప్రాయం ప్రకారం వ్యాయామ ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం టీజీపెటాను టీజీపీడీపెటా సంఘంగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. వీటి ద్వారానే అన్ని జిల్లాల్లో కమిటీలు వేసి త్వరలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ తాత్కాలిక కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మడి జిల్లాకు చెందిన దూమర్ల నిరంజన్ (పీడీ జెడ్పీహెచ్ఎస్ వల్లూరు, మహబూబ్‌నగర్), సంయుక్త కార్యదర్శులుగా నిరంజన్‌యాదవ్ (పీడీ జెడ్పీహెచ్ఎస్ బిజినేపల్లి, నాగర్‌కర్నూల్), రమణ (పీడీజెడ్పీహెచ్ఎస్ కోటకొండ, నారాయణపేట)ను ఎన్నుకున్నారు.



తాత్కాలిక కమిటీ అధ్యక్షులుగా నిరంజన్ తదితరులు

ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన తలారి శంకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీచర్ రాములు, నక్కల కుర్మయ్య, మాల మల్లయ్య, ఉమేష్, వెంకటేష్, వెంకటయ్య, అంజనేయులు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 8వ వార్డు పరిధిలోని పంచాయతీరాజ్ కాలనీలో ఆదివారం సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ హరికృష్ణ, కాంగ్రెస్ నాయకుడు విఠల్‌రెడ్డి, కాలనీ వాసులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, స్వాములు, వెంకటేశ్వరరెడ్డి, రాజన్నగౌడ్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్

దామరగిద్ద: మండలానికి చెందిన పదిమంది విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో దామరగిద్దకు చెందిన పుట్టి మణికంఠ, అరవింద్‌కుమార్, గోవింద్, పల్లవి, శ్రీనివాస్ నాయక్, నరేందర్‌నాయక్, కార్తిక్, నందు, శ్యామ్, వైష్ణవి ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

అట్టహాసంగా సదర్ ఉత్సవాలు



సదర్ ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్లలో సదర్ ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగాయి. స్థానిక నేతాజీచౌరస్తాలో యాదవ సంఘాల ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు సదర్ ఉత్సవాలు నిదర్శనమన్నారు. ప్రతి ఏటా సంప్రదాయ పద్ధతిలో సదర్ ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రత్యేకంగా తీసుకువచ్చిన దున్నపోతుల విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్‌యాదవ్, గిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు సరైన దిశానిర్దేశం లేదు

- మాజీ డీఈఓ డా.విజయకుమార్

భూత్పూర్ : నేటి యువతకు సరైన దిశానిర్దేశం లేక చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని మాజీ డీఈఓ డా.విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం భూత్పూర్ జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్, కేజీబీవీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా అలంపూర్‌లోని జోగులాంబ ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 47రోజుల్లో 510కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేశామన్నారు. గాంధీజీ ఆశయాలను, బోధనలను, జీవన విధానాన్ని వివరించి స్ఫూర్తి నింపేందుకు ఈ పాదయాత్ర కొనసాగుతుందని అన్నారు.



మాట్లాడుతున్న మాజీ డీఈఓ డా.విజయకుమార్

నేటినుంచి ఆరాధనోత్సవాలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సుభాష్‌రోడ్ సద్గురు అవధూత నర్సింహస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారం నుంచి మూడురోజులపాటు వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో ప్రత్యేకపూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు.. మఠానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరింపజేసి ఆరాధన ఉత్సవాలకు సిద్ధం చేశారు. సాయంత్రం జ్యోతిర్మయ నందగిరిమాత, బాల అవధూత ప్రకాశనంద సరస్వతి స్వామివారి ఊరేగింపు అనంతరం ధార్మిక ప్రవచనం ఉంటుందని తెలిపారు.

దళితుల అభ్యున్నతికి కృషిచేయాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు

జడ్చర్ల: దళితుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్‌పార్కులో చర్మ ఉత్పత్తుల తయారీకి సంబంధించి లిడ్‌క్యాప్ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. దీని ద్వారా ఎంతోమంది దళితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. లిడ్‌క్యాప్‌కు భూములిచ్చిన దళితులకు ఇప్పటివరకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలన్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

కేవీపీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంకర్, కార్యదర్శిగా నాగరాజుతోపాటు 12మంది సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కురుమయ్య, రమేశ్, పవన్, ఆంజనేయులు, బాల్‌చెన్నయ్య పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న పక్షులు వైర్లపై వరుసగా చేరాయి. అవన్నీ కరెంటు తీగలపై చేరటంతో తోరణం మాదిరి ఏర్పడి చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లు కనిపించకుండా చాలా దూరం వరకు పక్షులు కూర్చొని ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఈ దృశ్యం శనివారం నవాబుపేట మండల కేంద్రంలో కనిపించగా ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది.

– నవాబుపేట

వానాకాలంలో వరి, పత్తికి అపారనష్టం

- ఈ సీజన్‌లో పూడ్చుకునేందుకు యత్నం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- కార్యాచరణ సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

యాసంగిపైనే ఆశలు



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): యాసంగి సాగుపైనే జిల్లా రైతులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. వానాకాలం సీజన్‌లో అతివృష్టి కారణంగా వరి, పత్తి రైతులు నష్టాలను చవిచూశారు. యాసంగి సీజన్‌తోనైనా ఉపశమనం పొందాలనే ఆలోచనతో ఉన్నారు. యాసంగిలోనూ సహజంగానే వరి సాగునే అధిక శాతం చేపడుతారు. వేరుశనగ సాగు సైతం కీలకంగా మారనుంది. ఇప్పటికే కొన్నిచోట్ల పత్తి పంట తుడిచిపెట్టుకుపోగా.. దానిని చెడగొడ్డి వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. తెల్ల ‘బంగారం’గా చెప్పుకునే పత్తితో జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉంది. నిజానికి జిల్లా రైతులకు పత్తితో పాటు వరి పంటలే రైతులకు ప్రధాన ఆధారం. దశాబ్దాలుగా రైతులు పత్తి సాగుపై మమకారాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు.

యాసంగి సాగు 1.70లక్షల ఎకరాలు

జిల్లాలో పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 1,70,250ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తారని అంచనా. గతేడాదితో పోలిస్తే సాగు పెరగనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ఐదువేల ఎకరాలు అధికం

గతేడాది యాసంగి జిల్లాలో 1,65,003 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఈసీజన్‌లో 1,70,250 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు సిద్ధం చేశారు. గతేడాదితో పోలిస్తే ఇది ఐదువేల ఎకరాలు అధికం.

జిల్లాలో యాసంగి పంటల సాగు అంచనా

వరి 1,50,000	జొన్న 400
వేరుశనగ 15,000	రాగులు 300
మొక్కజొన్న 4,000	ఆముదం 250
ఇతర పంటలు	300

సన్నాలు సాగుచేస్తే లాభదాయకం

యాసంగి సీజన్‌లో పుష్కలంగా నీటిసౌకర్యం ఉన్న రైతులు సన్న రకం వరి సాగు చేసుకోవాలి. మార్కెట్‌లో సన్నాలకు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం సైతం బోనస్ ఇస్తుంది. నీటిసౌకర్యం తక్కువ ఉన్న పొలాల్లో మాత్రం మొక్కజొన్న, జొన్న, ఆముదం పంటలు సాగుచేస్తే లాభదాయకం. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తాం. సీజన్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాం.

రమణీయం.. శివపార్వతుల కల్యాణం

- శతచండీయాగం, పూర్ణాహుతి
- ముగిసిన ఆశ్రమ వార్షికోత్సవం
- సందర్శించిన ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల టౌన్: లక్ష్మీనారాయణ స్వామి ఆశ్రమ వార్షికోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణం రమణీయంగా సాగింది. ఈ వేడుకలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల వేడుకల్లో పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు, మాతాజీలు హాజరై ఆశీర్వచనాలు ఇచ్చారు. మూడో రోజు ఉదయం 6గంటలకు గీతాపారాయణంతో వేడుకలు ప్రారంభించారు.

108 ద్రవ్యాలతో పూర్ణాహుతి..

వేడుకల్లో మూడురోజులుగా నిర్వహిస్తున్న శ్రీరుద్రసహిత శతచండీ యాగం 108 ద్రవ్యాలతో పూర్ణాహుతి సమర్పించారు. యాగం పూర్ణాహుతితో ఆశ్రమంలో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసింది.

20 వసంతాలు పూర్తిచేసుకోవటం...

లక్ష్మీనారాయణ స్వామి ఆశ్రమం ఏర్పాటు చేసి 20వసంతాలు పూర్తిచేసుకోవటంతో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అభినందనలు తెలిపారు. వేడుకల చివరిరోజున ఆమె ఆశ్రమాన్ని సందర్శించారు. దివంగత నిత్యశుద్ధానందగిరి స్థాపించిన ఆశ్రమం ఈప్రాంతంలో ఉండటంతో ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల లోక కల్యాణం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.



సభలో మాట్లాడుతున్న పరిపూర్ణానందగిరిస్వామి



పూర్ణాహుతి సమర్పణ

భగవంతుడి ఆరాధనే మేలు: పీఠాధిపతులు

వేడుకల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన ఐదవ ఆత్మజ్ఞాన సభలో పలువురు పీఠాధిపతులు సందేశమిచ్చారు. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి, కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. భగవంతుడిని ఆరాధించటంతో అన్నికష్టాలను సులభంగా దాటవచ్చన్నారు. ప్రపంచం అంతా పంచభూతాత్మకమని, భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశాలని, వాటిని సంరక్షిస్తూ లోకకల్యాణానికి ఉపయోగపడేలా మన కృతజ్ఞత చూపాలన్నారు. వేడుకలు స్థానిక పీఠాధిపతి పరమాత్మానందగిరిస్వామి, వెంకట్‌చరణ్‌స్వామిల ఆధ్వర్యంలో కొనసాగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు, వేడుకలకు సహకరించిన వారిని సత్కరించారు. ఆయా ఆశ్రమాల నుంచి వచ్చిన పీఠాధిపతులను సత్కరించి వారిచే ఆశీర్వచనాలు ఇప్పించారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, హైదరాబాద్ తోపాటు ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో వేడుకలకు తరలివచ్చారు.